రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.47, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండకాయ 18, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 28, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 33, చామగడ్డ 40, మొరంగడ్డ 31, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5గా ఉన్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ 'సెల్ట్'లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న 'ద సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్' (సెల్ట్)లో స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్ సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి ఈనెల 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 10 ఆపైన విద్యార్హతలు గల ఉద్యోగ వేటలో ఉన్న అభ్యర్థులు, ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగులు, ఇంగ్లిష్ భాష మాట్లాడాలని ఆసక్తి గల వారు, గృహిణులు కోర్సులో చేరేందుకు అర్హులు. ఈనెల 12 నుంచి ఉదయం 6.30 నుంచి 8 గంటలు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొ.సవీన్ తెలిపారు. పూర్తి వివరాలకు 9985856507.

మహంకాళి ఆలయంలో రుద్రహోమం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన ఈ హోమంలో వేదపండితులు, అర్చకులతో పాటు భక్తులు పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదవితరణ చేశారు.

మర్యాదపూర్వక కలయిక



గీతారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీగణేశ్ తన రాజకీయ గురువు, పీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి గీతారెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మారేడుపల్లిలోని ఆమె నివాసానికి వెళ్లిన శ్రీగణేశ్‌ను ఆమె సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. 2009లో గీతారెడ్డి ప్రోత్సాహంతోనే తాను కాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితం ప్రారంభించినట్లు శ్రీగణేశ్ పేర్కొన్నారు. ఆమె చూపిన మార్గంలోనే అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చానని, తిరిగి మాతృపార్టీ ద్వారానే ఎమ్మెల్యేగా గెలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

రైల్వే పెన్షనర్లకు మెరుగైన సేవలు



రైల్వే పెన్షనర్లను సత్కరిస్తున్న సీనియర్ మేనేజర్ శశికుమార్

రాంగోపాల్‌పేట్: రైల్వే పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ శశి కుమార్ తెలిపారు. రెజిమెంటల్‌బజార్‌లోని ఎస్‌బీఐ హిమ్మత్‌నగర్ శాఖలో రైల్వే పెన్షనర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి శాలువ, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. పెన్షనర్ అసోసియేషన్ ప్రతినిధులు బీకేసింగ్, విద్యాసాగర్, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు తదితరులున్నారు.

అన్నదానాన్ని అడ్డుకోవడం సరికాదు

రసూల్‌పురా: రాజకీయ కక్షధోరణితో తిరుమలగిరి మహంకాళి ఆలయ అడహక్ కమిటీ సభ్యులు అమావాస్య రోజున ఆలయ ప్రాంగణంలో జరిగే అన్నదాన కార్యక్రమాన్ని అడ్డుకోవడం అవివేకమైన చర్య అని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్ అన్నారు. లాల్‌బజార్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ.. గత రెండేళ్ల నుంచి దాతల సాయంతో మహంకాళి ఆలయం ప్రాంగణంలో ప్రతి అమావాస్య రోజున పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. గురువారం ఆలయ అడ్‌హక్ కమిటీ సభ్యులు అన్నదానాన్ని అడ్డుకున్నారన్నారు. పేదల కోసం జరిగే సేవా కార్యక్రమాన్ని రాజకీయ కక్షతో అడ్డుకుంటున్నారని దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులను కలిసి సమస్యను వివరించి అనుమతి పొంది వచ్చే నెల అమావాస్య రోజున అన్నదానం చేస్తామని స్పష్టం చేశారు. బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ, రుక్మయ్య, యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



కంటోన్మెంట్: పదిరోజులుగా రోడ్డుపై మురుగు నీరు పారుతున్నప్పటికీ కంటోన్మెంట్ సిబ్బంది పట్టించుకోవడం లేదని, స్థానికులు బోర్డు సీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కంటోన్మెంట్ 4వ వార్డు పరిధిలోని పలువురు వ్యాపారస్తులు బీజేపీ నేతలతో కలిసి సీఈఓ మధుకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కాలనీని ఆనుకుని ఉన్న ప్రధాన రోడ్డుపై ఉన్న డ్రైనేజీ పదిరోజులుగా పొంగిపొర్లుతోందని తెలిపారు. బోర్డు సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం వల్ల పరిస్థితి మరింత తీవ్రమైందన్నారు. రోడ్డు వెంట ఉన్న వివిధ వ్యాపార కేంద్రాలు, విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలోకి వెళ్లే ప్రధాన మార్గం పది రోజులుగా మురికిమయంగా మారిందన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సమస్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే డ్రైనేజీ మరమ్మతులు చేపడతామని సీఈఓ వారికి హామీ ఇచ్చినట్టు సమాచారం. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విజయానంద్, నాగభూషణంరెడ్డి, పరశురామ్, స్థానికులు జగన్, ప్రేమ్ కుమార్, మహాత్మారావు, బండి మహేష్ తదితరులున్నారు.

మారుతున్న రూపురేఖలు

- టాయ్‌లెట్ల ఆధునీకరణ
- లష్కర్‌లో జీహెచ్‌ఎంసీ కృషి

పరిసరాల్లో తొలగిపోతున్న అపరిశుభ్రత



జామై ఉస్మానియాలో పరిసరాలను శుభ్రం చేసి క్యారమ్స్ ఆడుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంత రహదారుల రూపురేఖలు మార్చేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రహదారులపై ప్రవహించే వరద, మురుగుతో ఎదురయ్యే అనర్థాలను తొలగించేందుకు రూపొందించిన కార్యాచరణ అమలు చేస్తున్నారు.

- సికింద్రాబాద్‌లోని పలు ప్రధాన, అంతర్గత రహదారుల్లో అడుగుతీసి అడుగెయ్యలేని పరిస్థితులున్నాయి.
- ఇంకొన్ని ప్రాంతాల్లో నెలకొని ఉన్న మూత్రశాలల నుంచి మురుగునీరు నేరుగా రహదారులపైకి వచ్చి చేరుతుంది. ఇలాంటి దయనీయ పరిస్థితులు ప్రయాణికులకు గుదిబండగా మారుతున్నాయి. చెత్తచెదారాలను ఎత్తివేసి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు, రంగవల్లులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

ఆధునికీకరణ దిశగా..

సికింద్రాబాద్ ప్రాంతంలో పాత టాయిలెట్లను సమూలంగా తొలగించే కార్యక్రమం పూర్తయింది. వాటి స్థానంలో ఓ వైపు మెట్రో మరో వైపు జీహెచ్‌ఎంసీ అధికారులు అధునాతన టాయ్‌లెట్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో 43 సులబ్ టాయ్‌లెట్లు, 24 బయో కలుపుకుని మొత్తంగా 67 టాయ్‌లెట్లను ఇప్పటి వరకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిలో ఎక్కువ సంఖ్యలోని టాయ్‌లెట్లలో మెరుగైన సదుపాయాలను ఏర్పాటు చేశారు. 24 గంటల నీటిసరఫరా, వ్యర్థ జలాలు రహదారులపైకి రాకుండా పక్కాగా డ్రైనేజీలైన్లలోకి మాత్రమే పంపించేందుకు తీసుకుంటున్న చర్యలు తుది దశకు చేరాయి. డ్రైనేజీ లైన్లు అందుబాటులో లేని టాయిలెట్లకు ప్రత్యామ్నాయ చర్యలు అన్వేషిస్తున్నారు.

సుందరీకరణ పనులు..

టాయ్‌లెట్లు ఆధునీకరించి, రహదారుల మీదుగా వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటున్న అధికారులు ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను అత్యంత ఆకర్షణీయంగా రూపుదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైతే రహదారులపై చెత్త పడుతుందో అక్కడ చెత్త వేయకూడదన్న అవగాహన ఆయా ప్రాంత ప్రజలకు తెలియజెప్పి అవగాహన కల్పిస్తున్నారు. బోర్డులు, బ్యానర్ల ఏర్పాటు..

- ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మరోవైపు బోర్డులు, బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. టాయ్‌లెట్ల వద్ద ఆరోగ్యకర వాతావరణం, సుందరీకరణతో బహిరంగ మూత్రవిసర్జనను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు.

రంగవల్లులు, క్రీడలు..

రహదారులను పరిశుభ్రంగా ఉంచడంతో వాటి రహదారుల రూపురేఖలు మార్చుతున్నారు. దీనికోసం ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రజలు రహదారులపై చెత్తచెదారాలను వేసే ప్రాంతాలను ముందుగా గుర్తిస్తున్నారు. అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు రంగవల్లులు వేస్తున్నారు. అదే ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది కూర్చొని క్యారమ్స్, చెస్ వంటి గేమ్స్ ఆడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకూడదన్న సంకేతాలు పంపిస్తున్నారు.

సత్ఫలితాలు సాధిస్తున్నాం..



సికింద్రాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తాము చేపడుతున్న కార్యక్రమాలకు సత్ఫలితాలు వస్తున్నాయి. దీని కోసం ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తాము తీసుకుంటున్న చర్యలకు ఆయా ప్రాంతాల కార్యక్రమానికి పౌరులు సహకరించడం ద్వారా అనారోగ్యకర పరిస్థితులను రూపుమాపొచ్చు. భవిష్యత్తులో రహదారులపై అనర్థాలు, దుర్గంధ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– రవికిరణ్, జీహెచ్‌ఎంసీ జడ్‌సీ

ఓయూ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం



ఉద్యోగులకు పత్రాలను అందజేస్తున్న సీఐటీయూ నేత మహేందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న 382 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లభించింది. గురువారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఓయూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్ ఈఎస్‌ఐ, పీఎఫ్ పత్రాలను అందజేశారు. ఈ సౌకర్యంతో ఉద్యోగులు వైద్యం, ఇతర సదుపాయాలతో పాటు అనేక రకాలుగా లబ్ధి పొందుతారని వివరించారు. ఓయూలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వర్కర్ల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాడి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి వేతనాలు పెంచడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సీతారాం, నాయకులు లక్ష్మీనర్సమ్మ, వెంకటమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన స్థానిక నేతలు



సీఎం రేవంత్‌రెడ్డితో కంటోన్మెంట్ నేతలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ సంజీవరెడ్డి నేతృత్వంలో తనను కలిసిన కాంగ్రెస్ నేతలను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల జరిగిన కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం పనిచేసిన కార్యకర్తల కృషికి తగిన ఫలితం అందజేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన హామీలన్నింటినీ తీరుస్తానని సీఎం హామీ ఇచ్చారని సంజీవరెడ్డి తెలిపారు. నరసింహన్, జీవీ బాలరాజ్, గజ్వేల్ భరత్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన



కరపత్రాన్ని విడుదల చేస్తున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన చేయిస్తున్నామని విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్జేడీ విజయలక్ష్మి, డీఈఓ రోషిణి తదితర అధికారులతో కలిసి ఆమె విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు తక్కువ అని అనవసరంగా ఫీజుల రూపంలో డబ్బు పోగొట్టుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు, తాగునీళ్లు, విద్యుత్ తదితర పనులను చేయించి మంచి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కొంత మంది తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల నుంచి ఎందుకు ప్రభుత్వ పాఠశాలల్లోకి పిల్లలను తీసుకొచ్చారని ప్రశ్నించగా.. ప్రైవేటులో ఫీజులు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ చేర్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు బోధన కూడా నచ్చిందని తల్లిదండ్రులు సమాధానం ఇచ్చారు. కొంతమంది విద్యార్థులతో మాట్లాడి వివిధ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బడిబాటలో భాగంగా ఇంటింటికి తిరిగి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. డిప్యూటీ ఐవోఎస్ సుమన్, డిప్యూటీ ఈవో శ్రీధర్, హైస్కూల్ హెచ్‌ఎం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



అమీర్‌పేట: అమీర్‌పేట హనుమాన్ దేవాలయంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి సతీమణి ఇందిరారెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం శనిజయంతి సందర్భంగా ఉదయం పూజల్లో పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

సికింద్రాబాద్: బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి విజయోత్సవ వేడుకలు గురువారం సీతాఫల్‌మండి కూడలిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. బాణాసంచా కాల్చిన నాయకులు, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. బీజేపీ నేతలు రవిప్రసాద్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, అంబాల రాజేశ్వర్‌రావు, హరి, ఆకారపు రమేష్, శారదామహేష్ తదితరులున్నారు.

ఈటల రాజేందర్‌కు సన్మానం..

రసూల్‌పురా: మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా కొనసాగాలని ఆకాంక్షించారు. అశోక్, జబ్బార్, సామల సత్తిరెడ్డి, మాచర్ల శ్రీనివాస్, మణికంఠ, పాండు, నాగరాజు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌బజార్‌లో..

బన్సీలాల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించి నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్న సందర్భంగా పాన్‌బజార్‌లో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ అధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దఎత్తున టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న కేశవరెడ్డి తదితరులు

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులు చేపడుతున్నామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తెలిపారు. ఆరోవార్డు పరిధిలోని భావనకాలనీ, అమరజ్యోతి కాలనీల పరిధిలో రూ.40 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులకు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు భానుక నర్మద మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ కాలనీల్లో 30 ఏళ్ల క్రితం నాటి డ్రైనేజీ లైను దెబ్బతినడంతో పాటు తాగునీటి పైపులైన్లలో కలిసి పోయిందన్నారు. దీంతో బోర్డు అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించామన్నారు. మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, సంపత్‌రాజ్ జైన్, రాజేందర్, రాజ్‌కుమార్, రాజీవ్, అశోక్, సీతమ్మ, రాణి, పద్మమణి, మీరా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ ఫుట్ సమస్యలపై అవగాహన



బేగంపేట్ కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో వరల్డ్ క్లబ్ ఫుట్ డేను నిర్వహిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: వరల్డ్ క్లబ్‌ఫుట్ డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్ ఆస్పత్రిలో గురువారం క్లబ్ ఫుట్ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ నేతృత్వంలో క్లబ్‌ఫుట్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ విద్యాసాగర్ పరీక్షించి చికిత్సను అందించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్స్ ఎండీ డాక్టర్ ఏవీ.గురువారెడ్డి చిన్నారులకు ప్రోత్సాహకాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. వరల్డ్ క్లబ్ ఫుట్‌డేను పురస్కరించుకుని కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రిలో ప్రతిఏటా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం క్లబ్‌ఫుట్ సమస్యకు ఆధునిక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. గతంలో పిల్లల తల్లిదండ్రుల అవగాహన లేకపోవడం, టెక్నిక్స్ అంతగా అందుబాటులో లేకపోవడంతో క్లబ్‌ఫుట్ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండేదన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో పాటు టెక్నిక్స్‌తో పిల్లలు సాధారణ జీవితం గడపడమే కాకుండా క్రీడల్లోనూ పాల్గొనవచ్చన్నారు. క్లబ్‌ఫుట్ వంశపారపర్యంగా కొంతమందిలో వచ్చే అవకాశం ఉందన్నారు. క్లబ్‌ఫుట్ సమస్యకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

రసూల్‌పురా: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని యువ పారిశ్రామికవేత్తలు నిరుద్యోగులకు జీవనోపాధిని కల్పించేందుకు ముందుకురావాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. గురువారం కంటోన్మెంట్ క్లాసిక్‌గార్డెన్‌లో ఎంబ్రాయిడరీ డిజైన్లు, మగ్గం వర్క్, చేతికుట్టు మిషన్లు, ప్రింటింగ్ విద్యుత్ మిషన్ల అంతర్జాతీయ వాణిజ్య ఫర్‌ఫ్యాబ్–టీఎక్స్ నేటి నుంచి మూడ్రోజుల పాటు జరగనున్న ప్రదర్శనను వకుళాభరణం ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునికకాలంలో సమయం చాలా విలువైనదని కాలంతో పాటు పరుగులు తీసి అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. వకుళాభరణం కృష్ణమోహన్‌రావుకు నిర్వాహకులు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. వర్ధన్ ఈ–వెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ బీపీ. మిశ్రా, జాతీయ రాష్ట్రస్థాయి మేర సంఘం దర్జీ సంఘం నాయకులు పొడిశెట్టి నరసింగరావు, శంగేవార్,నర్సింగ్‌రావు, ప్రతిమ తదితరులున్నారు.

లేబర్ అడ్డా వద్ద టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని లేబర్ అడ్డా వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు గౌరీ నాగరాజు కోరారు. గురువారం తుకారాంగేట్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ.. ఆసియాలోనే అతిపెద్ద మురికివాడైన అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ మూత్రశాలలు ఏర్పాటు చేయాలని అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు తీరడం లేదన్నారు. మూత్రశాలలు లేకపోవడంతో భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల్లో ముఖ్యంగా ఆడవాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనారోగ్యాల భారిన పడి కిడ్నీలు పాడవుతున్నాయన్నారు. ఇప్పటికైనా తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.

యూపీ ఎంపీకి భీమ్ ఆర్మీ విద్యార్థుల సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) జాతీయ అధ్యక్షులు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ ఎంపీగా గెలుపొందినందుకు ఓయూ విద్యార్థులు యూపీకి వెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బిజినూర్ జిల్లా నగిన పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆజాద్ సమాజ్ పార్టీ నుంచి ఎంపీగా ఆయన గెలుపొందినట్లు భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ విద్యార్థి తీగల శివకుమార్ వివరించారు. గతేడాది తెలంగాణ సచివాలయం ఎదుట నిర్మించిన 123 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ కవితతో కలసి సందర్శించిన ఆయన మాజీ సీఎం కేసీఆర్‌ను అభినందించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆజాద్ సమాజ్‌వాది పార్టీ వ్యాప్తికి కృషి చేస్తామన్నారు. నాగరాజు, ఎర్ర సురేందర్, రవిప్రకాష్, బాలు తదితరులున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటన



కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీగణేశ్ క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. గత మంగళవారమే ఆయన ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా.. రెండో రోజే నియోజక పర్యటన మొదలుపెట్టారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్ఖానాలోని తన క్యాంపు కార్యాలయానికి వచ్చే సందర్శకులను కలిశారు. వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన నేతలు, ప్రజలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నేరుగా వాసవీ కాలనీలో వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అమావాస్య అన్నదానంలో పాల్గొన్నారు. అటు నుంచి కంటోన్మెంట్‌లోని ప్రముఖ కాలనీ అయిన అమరావతి కాలనీ అధ్యక్షులు అమర్‌నాథ్, సూర్య ఎన్‌క్లేవ్‌లోని ప్రముఖ సాంఖ్య శాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మలను కలిసి తన గెలుపునకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నేతలు సతీష్ గుప్తా, మధుకర్, సదానంద్‌గౌడ్, బద్రీనాథ్‌యాదవ్, తేజ్‌పాల్, రమేష్, సంకి రవీందర్, సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అమరావతీ కాలనీలో అమర్నాథ్ యాదవ్, దైవజ్ఞశర్మలతో..

చిన్నారులతో క్రికెట్..

కంటోన్మెంట్: ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీగణేశ్ చిన్నారులతో సరదాగా క్రికెట్ ఆడి వారిని అలరించారు. పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆ కాలనీలోని చిన్నారులు ఆయనను ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా తగిన స్థలాలను గుర్తించి క్రీడామైదానాలుగా తీర్చిదిద్దుతామన్నారు.